## “తెలుగు పద్యం - సంగీత స్వరకల్పన” ప్రసంగంతో దద్దరిల్లిన ఉత్తర టెక్సస్ తెలుగు సంఘం సాహిత్యవేదిక

ఉత్తర టెక్సస్ తెలుగు సంఘం (టాంటెక్స్ ) సాహిత్య వేదిక ఆధ్వర్యంలో 130 వ నెల నెలా తెలుగు వెన్నెల కార్యక్రమం ఆదివారం మే 20 వ తేదీ, ఇర్వింగ్ లో సాహిత్యవేదిక సమన్వయకర్త శ్రీ వీర్నపు చినసత్యం గారి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. చిన్నారుల ప్రార్ధనా గీతం తో ఆరంభమైన ఈ కార్యక్రమంలో , డా. ఊరిమిండి నరసింహారెడ్డి తెలుగు సిరి సంపదలు అనే అంశం మీద మాట్లాడుతూ తెలుగు సామెతలు మీద ఆసక్తి కరమైన అంశాలు పంచుకొన్నారు. డా. పుదూర్ జగదీశ్వరన్ గారు ఆముక్తమాల్యద నుండి "నట త్పయోబ్ధి వీక్ష్య.." అనే సీస పద్యంలో శ్రీ కృష్ణ దేవరాయలవారి గంభీర వర్ణన చక్కగా వివరించారు, సాహిత్య మెళుకువలు తెలియచేశారు.. మాసానికో మహనీయుడు అనే అంశం మీద శ్రీ సుబ్బు జొన్నలగడ్డ గారు మాట్లాడుతూ మేనెలలో చలం తదితర గొప్ప కవులను స్మరించు కొన్నారు. తెలుగు చమక్కులు అనే అంశం మీద దయాకర్ మాడ చక్కని ప్రసంగం చేశారు. వేముల లెనిల్ బాబు తెలుగు వ్యుత్పత్తి అనే అంశం మీద చక్కని పాటలు కంజర దరువులతో పాడి వినిపించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ ఎర్రాప్రగడ రామకృష్ణ విచ్చేశారు. ఆయనను శ్రీ సుబ్బు జొన్నలగడ్డ గారు పుష్పగుచ్ఛంతో సత్కరించారు, సభకు కోడూరు కృష్ణా రెడ్డి గారు పరిచయం చేశారు. శ్రీ ఎర్రాప్రగడ గారు వంశీ బర్కిలీ , అంతర్జాతీయ ఒవైసీ అవార్డు గ్రహీత మరియు ప్రముఖ దినపత్రిక ఈనాడుకు (అంతర్యామి...) ఎన్నో వేల ఆర్టికల్స్ రాసిన ఘనులు . **“తెలుగు పద్యం - సంగీత స్వరకల్పన”** అనే అంశం మీద అమితాసక్తి కలిగించే ప్రసంగం చేశారు. తెలుగు పద్యం అర్ధం చేసుకోవడానికి అత్యున్నత మానసిక స్థితి అవసరం అని ప్రతి పద్యాన్ని భావుకతతో చదివినప్పుడే నిజమైన ఆనందం లభిస్తుంది అని చెప్పారు. వెయ్యి సంవత్సరాలకు పైగా తెలుగు పద్యం ఎందుకు నిలబడింది అంటే దాని నిర్మాణాత్మక విలువలే కారణం అని తెలిపారు . పద్యాన్ని రాగయుక్తంగా చదవడం ఎంతో అవసరం అని రాగం మారినప్పుడు పద్యంలో సాంద్రత , ఆర్ద్రత మారుతాయి , నిజమైన అర్ధం మరుగున పడుతుంది అని చెప్పారు . హరిశ్చంద్ర నాటకాన్ని మాధవపెద్ది వెంకటరామయ్య గారు వేసినట్లు వేరెవరకు సాధ్య పడదు అని , సావిత్రి మంగళ సూత్ర ఘట్టాన్ని కడురమ్యంగా పాడి వినిపించారు. శ్రీ ఎర్రాప్రగడ రామకృష్ణ గారు రాగయుక్తంగా పాడిన పద్యాలకు సభ్యుల జేజేలు,చప్పట్లు,ఈలలు తో స్పందన తెలియజేశారు.

శ్రీ ఎర్రాప్రగడ రామకృష్ణ గారిని టాంటెక్స్ సాహితీ కమిటీ సభ్యులు , టాంటెక్స్ అధ్యక్షురాలు శ్రీమతి కృష్ణవేణి శీలం, ఉత్తరాధ్యక్షులు శ్రీ చినసత్యం వీర్నపు, పాలకమండలి సభ్యులు శాలువా, జ్ఞాపిక ఇచ్చి ఘనంగా సత్కరించారు. తనను ఎంతో ఆదరించి, చక్కటి ఆతిథ్యం అందించిన టాంటెక్స్ కార్యవర్గానికి శ్రీ ఎర్రాప్రగడ రామకృష్ణ గారు కృతజ్ఞతలు తెలియచేయడంతో కార్యక్రమం ఘనముగా ముగిసింది.

ప్రత్యేక ప్రసార మాధ్యమాలైన టీవీ 5, మన టి.వి,టి.ఎన్.ఐ, ఏక్ నజర్ లకు కృతజ్ఞతాపూర్వక అభివందనములు తెలియజేసారు.
కార్యక్రమంలోని ఛాయాచిత్రాలను ఈ లంకెలో చూడవచ్చును.

https://tantex.smugmug.com/organize/2018-Events/Sahitya-Vedika/130th-NNNTV-Sahitya-Vedika-05202018

టాంటెక్స్ **130** వ నెల నెలా తెలుగు వెన్నెల సదస్సు గురించి సాహిత్య వేదిక బృంద సభ్యుడు శ్రీ జలసూత్రం చంద్రశేఖర్ సమర్పించిన నివేదిక.